పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో మంగళవారం పిడుగు పడి రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన మరడ అప్పలనాయుడు (55) పొలంలో గడ్డి కోస్తుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య సత్యవతి, కుమార్తె మాధురి, కుమారుడు రామకృష్ణ వున్నారు. అప్పలనాయుడు మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

మృతుడు అప్పలనాయుడు

సభలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు : గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీనిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు

మతోన్మాద బిజెపిని తరిమికొట్టాలి

- అడవిపై హక్కులు ఆదివాసీలవే
- ప్రచారభేరి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కురుపాం, గుమ్మలక్ష్మీపురం

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మతోన్మాద బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ఏకం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రచార భేరీలో భాగంగా మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలోని బిఎస్ఆర్ కళ్యాణ మండపంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, సిపిఐ నాయకులు తోట జీవన్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా వి.శ్రీనివాసరావుతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పాల్గొన్నారు. ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బిఎస్ఆర్ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పండిన అటవీ సంపదపై గిరిజనులకే హక్కు ఉంటుందని అన్నారు. పీసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో ఉండే ప్రతి సెంటు భూమి పంచాయతీ తీర్మానం లేకుండా అమ్మడానికి గాని, కొనడానికి గాని వీలులేదని, అటువంటిది 1/70 చట్టం, జీవో నెంబర్ 3కు తూట్లు పొడుస్తూ అడవులను కూడా అదానీకి ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని అన్నారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజలు ఐక్యం కాకుండా చేస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కనీసం గిరిజన ప్రాంతంలో పండిన పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం కల్పించలేకపోవడం శోచనీయమన్నారు. నల్లచట్టాలను తీసు కొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు బిజెపి కట్ట బెట్టేందుకు చూస్తే అడ్డుకొని రద్దు చేసే వరకు పోరాడింది ఎర్రజెండాలేనని గుర్తు చేశారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వంత పాడుతున్నాయని అన్నారు. మతోన్మాద బిజెపిని తరిమి కొట్టడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ అధికారం కోసం రాష్ట్రంలో రెండు పార్టీలూ యాత్రలు చేపట్టాయి తప్ప ప్రజల ప్రయోజనం కోసం కాదని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న దుశ్చర్యలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి గాని, ప్రతిపక్ష టిడిపి గాని, జనసేన గాని ఖండించడం లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బారావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె. మన్మధరావు, సిపిఎం నాయకులు కె.గంగునాయుడు, వి.ఇందిర, మండంగి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు జి.సూరయ్య, పి.ప్రసాద్, ఎల్విన్ పేట ఎంపిటిసి మండంగి రమణ, కుక్కిడి సర్పంచ్ జి. రాజారావు, గిరిజనులు పాల్గొన్నారు.

సెలవులే ఇవ్వలేదు..పాఠశాలలు పునప్రారంభం కాలేదు

మొదలైన విద్యావ్యాపారం



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి సెలవులు ఇవ్వకముందే... పాఠశాలలు పున: ప్రారంభం కాకముందే ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ విద్యార్థుల తల్లిదండ్రుల్లో వణుకుపుట్టిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో అత్యంత లాభసాటి వ్యాపారాల్లో విద్య ఒక టిగా మారింది. ప్రజాప్రతినిధుల నుంచి వ్యాపారుల వరకూ అందరూ ఇందులో పెట్టుబడులు పెడుతున్నారు. జిల్లాలో ప్రైవేటు జూనియర్ కాలేజీలు, హై స్కూళు సుమారుగా 600 పైగా ఉన్నాయి. విద్యా సంవత్సరం ముగియక ముందే వాటి వ్యాపారం ప్రారంభించారు. అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల చేరికలను ప్రారంభించేశారు. జిల్లాలో ఒకవైపు కార్పొరేట్, ప్రైవేట్, ఎయిడెడ్ సంస్థలు ఫీ'జులుం' చూపిస్తూనే మరోవైపు ఇతర మార్గాల్లో కూడా డబ్బులు దండుకుంటున్నాయి. అడ్మిషన్ల టైం లోనే పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, షూలను విక్రయిస్తూ అదనపు ఆదాయం గడిస్తున్నాయి. అది కూడా రెట్టింపు రేట్ల దోపిడీతో పుస్తకాల విక్రయాల ద్వారా ప్రైవేటు స్కూళ్ల తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. పాత బకాయిలను కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ముక్కుపిండి వసూలు చేశాయి.

పాఠశాలలు, కళాశాలలు జూన్‌లో ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ లాంటి విద్యార్థి సంఘం పుస్తకాలు, యూనిఫారం వ్యాపారంపై ఆందోళనలు చేస్తుండటంతో విద్యా సంవత్సరం ముందుగానే ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారాన్ని ప్రారంభించాయి. గత రెండు నెలలుగా పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులకు, జూనియర్ కాలేజీలు అధ్యాపకులకు అప్పగించాయి. ఇప్పటికే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫీజు బకాయి చెల్లించని యెడల వచ్చే విద్యా సంవత్సరం పుస్తకాలు ఇచ్చేది లేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకో పోవడంతో వారి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

భారీగా పెరిగిన ఫీజులు

జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు వచ్చే ఏడాదికి భారీగా ఫీజులు పెంచేశారు. ప్రతి తరగతికి కనీసం పదివేలు నుంచి 20వేలు వరకు ఫీజులు పెంచేశారు. రక రకాల పేర్లతో తరగతులను విభజించి ఫీజులను గుంజుతున్నారు. వాటిలో చైతన్య,నారాయణ పాఠశాలలు, కళాశాలలు పోటీ పడుతున్నాయి. పదోతరగతి విద్యార్థికి ట్యూషన్ ఫీజు కింద రూ.27వేలు, తొ మ్మిదో తరగతి ట్యూషన్ ఫీజు కింద రూ.23,500 దీనికి అదనంగా మరో రెండు వేలు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మేలుకొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యా వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

వచ్చే విద్యా సంవత్సరానికి ముందుగానే ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారం మొదలుపెట్టాయి వెంటనే జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి. పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులను చేర్పించేందుకు ముందుగానే పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అడ్వాన్సు ఫీజు కట్టించుకొని సీట్లు బలవంతంగా భర్తీ చేసుకోవడం దారుణం. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు ఈ పని చేస్తున్నాయి. వచ్చే ఏడాది పుస్తకాలు ఇప్పటికే విద్యార్థులకు అమ్మేస్తున్నారు. విద్యా శాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి.

పి.రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని నాగోజిపేటలో మంగళవారం 47 మంది స్థానికులకు ఇళ్లపట్టాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పట్టాలను అందించడం ఆనందంగా ఉందన్నారు. గత పాలకులు పట్టాలందిస్తామని మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని తీరా గెలుపొందాక నాగోజిపేట వాసులను పట్టించుకునే వారు కాదని అన్నారు. తాము అధికారం చేపట్టాక ఈ ప్రాంతంలో అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. నాగోజిపేట ప్రాంతమంతా పూర్తిగా నగరపాలక సంస్థకు చెందిన స్థలాలని, పేదలు ఎన్నో ఏళ్లుగా నివసించడం వల్ల అడ్డంకులను తొలగించి వారందరికీ పట్టాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, తహశీల్దార్ బంగార్రాజు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, స్థానిక వైసిపి నాయకులు యడ్ల రాజేష్, కార్పొరేటర్ జివి రంగారావు, యాదవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు గొట్టముక్కల మురళి తదితరులు పాల్గొన్నారు.



పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

గడప గడపకూ సమస్యలు తెలుసుకుంటూ...

అయ్యన్నపేటలో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో కోలగట్ల వీరభద్రస్వామి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు పై అభిప్రాయాలు, కాలువలు, వీధి దీపాలు, రహదారులు వంటివి ఏర్పాటుకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అవినీతి లంచగొండితనం లేకుండా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించే ఏర్పాట్లు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జి దూబె, వైసిపి నాయకులు సైలాడ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు లంక మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ప్రారంభం

అయ్యన్నపేట కోమటి చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను వీరభద్ర స్వామి ప్రారంభించారు. కోమటి చెరువు ప్రాంతాన్ని ఇప్పటికే అన్ని విధాల అభివృద్ధి చేశారు. బండ్ ఫార్మేషన్, వాకింగ్ ట్రాక్, ప్రధాన గేటు, విద్యుత్ స్తంభాలు, లైట్లు వంటివి ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి మాట్లాడుతూ రూ.13.60 లక్షల రూపాయలతో 30 విద్యుత్ స్తంభాలను, లైట్లను ఏర్పాటు చేయడం ఇక్కడ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, ఎఇ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా ఉంటాం

క్రికెట్ ఆడుతుండగా.. పిడుగుపాటుకు గురై మృతి చెందిన గాజులరేగకు చెందిన పి.ఇజ్రాయిల్(21) కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి భరోసా ఇచ్చారు. మంగళవారం ఇజ్రాయిల్ మృతదేహాన్ని కొత్తపేట స్వర్గధామానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు భారీ ర్యాలీగా తీసుకొచ్చారు. అక్కడకు చేరుకున్న కోలగట్ల.. ఇజ్రాయిల్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రమాదానికి గల కారణాలపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లు దగ్గరుండి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు.

జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయం

- రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- పలుచోట్ల నూతన భవనాలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గుర్ల, చీపురుపల్లి

ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ నాలుగేళ్లలో సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలను నేరుగా ప్రజలకు అందించామన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు కరోనా సమయంలో కూడా ఇబ్బందులు పడకుండా ధైర్యంగా నిలబడ్డారని చెప్పారు. గుర్ల మండలం జమ్ము గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్నెస్ సెంటర్లను, చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, పిఎసిఎస్ భవనాలను మంగళవారం మంత్రి బొత్స ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో బొత్స మాట్లాడుతూ, ప్రజల డబ్బు ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తుంటే, ప్రతిపక్షాలు తట్టుకోలేక, లేనిపోని తప్పుడు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని గుర్తించి, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గ్రామానికి సిసి రోడ్లను, పిఎసిఎస్ భవనాన్ని మంజూరు చేశారు. ఇంటింటికీ కుళాయిలు బిగించాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సూచించారు.

ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు అని పేర్కొన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, అధికారులు ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, సర్పంచులు జి.నర్సింహమూర్తి, కె.వరలక్ష్మి, డిప్యూటీ సిఇఒ కె.రాజ్ కుమార్, ఆర్‌డిఒ అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా శంకర్, డిఎల్‌డిఒ లక్ష్మణరావు, సిడిపిఒ ఆరుద్ర, తాహశీల్దార్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్లలో వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సచివాలయ వ్యవస్థతో సమస్యలు పరిష్కారం

చీపురుపల్లి సభలో మంత్రి మాట్లాడుతూ గతంలో చిన్నపాటి సమస్య పరిష్కారం కోసం కూడా మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, మధ్య వర్తులను ఆశ్రయించాల్సి వచ్చేదని సచివాలయ వ్యవస్థ రాకతో అలాంటి పరిస్థితి తొలగిపోయిందని అన్నారు. ఏటా రూ.33వేల కోట్లు విద్యారంగానికి కేటాయిస్తు న్నామని గుర్తు చేశారు. సుమారు వెయ్యి పాఠశాలలో సెంట్రల్ సిలబస్‌ను కూడా ప్రవేశ పెడుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో సచివాలయ సిబ్బందిని, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందిని వేదిక వద్దకు పిలిచి ప్రజల సమక్షంలోనే వారిద్వారా అందుతున్న సేవలపై మంత్రి ఆరా తీశారు. స్థానిక మహిళా పోలీసు స్థానిక పరిస్థితుల గురించి మంత్రికి వివరించారు. వివాదాలు, గొడవలు పెద్దగా జరగవని చెప్పగా మంత్రి కలగజేసుకొని కర్లాం వాళ్లు క్రమ శిక్షణ కలిగి ఉంటారని, మాట వింటారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు ఎమ్‌పి బెల్లాన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గోదాం నిర్మించేందుకు గాను ఎకరా స్థలాన్ని ప్రభుత్వానికి అందించిన దాతలు చిట్టి పెద్దప్పలస్వామి, బంగారు నర్సింహులు, బడ్నాన జగ్గునాయుడు, చిమిటి పెంటయ్య కుటుంబ సభ్యులను మంత్రి, ఎంపీ, జిల్లా కలెక్టర్ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ చినరాము నాయుడు, స్థానిక సర్పంచి భాగ్యలక్ష్మి, ఎంపిపి అనంతరావు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సందడి చేస్తున్న హీరో చేతన్

సీతంలో 'విద్యార్థి' సినిమా బృందం సందడి

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మధు మాదాసు దర్శకత్వంలో నిర్మిస్తున్న 'విద్యార్థి' సినిమా బృందం సందడి చేసింది. చిత్ర దర్శకుడు మధు మాదాసు, కథానాయకుడు చేతన్ చీను ఇతర ముఖ్య పాత్రధారులు పాల్గొని సీతం కళాశాల విద్యార్థులను ఆట పాటలతో మాటలతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కుల మతాలకు అతీతంగా మానవత్వం అలవరచుకోవాలని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని, ఈ చిత్రం అఖండ విజయం సాధించాలని కోరుకుంటూ చిత్ర కథానాయకుడు చేతన్ కు ఆశీర్వాదములూ, దర్శకునికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్.మజ్జి శశి భూషణ్‌రావు మాట్లాడుతూ ఈసినిమా సందేశాత్మకమైనదని, విద్యార్థులంతా తప్పక చూడాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సిటియులో పర్సనాలటీ డెవలప్‌మెంట్‌పై సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం

కొండకరకాం వద్ద నున్న ట్రైబల్ యూనివర్సిటీ లో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్తంగా కెపాసిటీ బిల్డింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్‌పై సెమినార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయం నుంచి సమాచారం అందిింది. ఈనెల 26 న ట్రైబల్ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ వాసిరెడ్డి పద్మావతి ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. సెమినార్ లో ప్రధానంగా డిజిటల్ లిటరసీ, పెర్సనల్ కెపాసిటీ బిల్డింగ్, కెరీర్ స్కిల్ అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.

పేదలను ఆదుకోవడమే నిజమైన సేవ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆకలితో ఉన్న పేదలను ఆదుకోవడం మాధవ సేవతో సమానమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎజిఎం జె. శ్రీనివాసరావు అన్నారు. ఎన్‌సిఎస్ థియేటర్ వద్దగల ఫుడ్ బ్యాంక్ వద్ద పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఫుడ్ బ్యాంక్ నిర్వహిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ నగరంలో పేదలకు ఉచితంగా ఆహారాన్ని అందించాలన్న ఆలోచన చేయడమే కాకుండా ఆచరణ సాధ్యం చేసి చూపిస్తున్న కోలగట్ల వీరభద్ర స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. గౌరీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కనిశెట్టి సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బయోలజీ ఫోరం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా బయోలజీ ఉపాధ్యాయుల ఫోరం ఎన్నికైంది. మంగళవారం ఫోరం కార్యవర్గ సమావేశం కోటలోని ఎంఆర్ హైస్కూలులో జరిగింది. ఈ సందర్భంగా డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.అనంతరం పరిశీలకులు వి.సత్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో గౌరవ అధ్యక్షులుగా ఎం.కృష్ణారావు, సలహాదారులుగా బి.వేణుగోపాలరావు, అధ్యక్షులుగా జి.సన్యాసినాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎ.సురేంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా ఎం.అమర్నాథ్, కార్యదర్శులుగా సిహెచ్ సుజాత, ఇ.అప్పలరాజు, కోశాధికారిగా జి.అర్జునరావు, సంయుక్త కార్యదర్శిగా డి.మీనా కుమారి, పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఉప విద్యాశాఖ అధికారి ఎన్‌టి నాయుడు, డిసిఇబి కార్యదర్శి టి.సన్యాసి రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేసలి అప్పారావు

బాల్య వివాహాలు చేస్తే కేసులు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలిఅప్పారావు తెలిపారు. మంగళవారం విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును ఐసిడిఎస్ సిడిపిఒ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వివాహ వయసు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. వయసు పాటించడం ద్వారా మహిళలు విద్యాపరంగా, ఆరోగ్య పరంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని అన్నారు. బాలికలు 18 సంవత్సరాల లోపు వివాహం చేసుకోవడం వల్ల అబార్షన్లు జరగడం గానీ పుట్టిన పిల్లలు అంగవైకల్యంతో పుట్టడం గానీ జరుగుతుందన్నారు ముఖ్యంగా ప్రజాప్రతినిధులు అందరూ సహాయ సహకారాలు అందిస్తే బాల్య వివాహాలను అరికట్టడంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అవకాశం ఉంటుందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ హిమబిందు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వలన ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు గురవుతారని అన్నారు. ఒకటో పట్టణ సిఐ బి.వెంకట్రావు మాట్లాడుతూ ఆడపిల్లలు పట్లే కాదు ముఖ్యంగా మగ పిల్లల పట్ల కూడా తల్లిదండ్రులు అప్రమత్తమై ఉండి వాళ్ళు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కార్పొరేటర్లు, సిడిపిఒ విజయ్ కుమారి డిసిపిఒ సత్యనారాయణ, సూపర్ వైజర్లు, మహిళ సంరక్షకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంకాడలో రక్షణ గోడ పనులు ప్రారంభం

చురుగ్గా సాగుతున్న నిర్మాణపనులు

డెంకాడ: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు వద్ద చేపల కాన సమీపంలో రక్షణ గోడ పనులను పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరీ మంగళవారం ప్రారంభించారు. విజయనగరం నాతవలస రహదారిలోని డెంకాడ ఊరి చివరలో ఆర్ అండ్ బి కలవర్టును ఆనుకొని పెద్ద కాలువ ఉంది. ఆ కాలువకు రక్షణ గోడ లేక ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఈ విషయం సొసైటీ చైర్మన్ సింహాచలం దృష్టికి రావడంతో సర్పంచ్ ఆధ్వర్యంలో రక్షణ గోడ పనులను మొదలుపెట్టారు. దీంతో సొసైటీ చైర్మన్‌ను, సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

వెంకన్నపేటలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

డెంకాడ : మండలంలోని వెంకన్నపేటలో ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించి వీధుల్లో చెత్తను తొలగించారు. డ్రైనేజీ ప్రాంతాల్లో దోమల వృద్ధిని, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టడానికి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఎంవిజిఆర్ డీన్ ఎస్ మోహన్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎన్ షణ్ముఖరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం కోసం యోగా, ధ్యానం చేయాలన్నారు.

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికీ 'ఉపాధి'

శృంగవరపుకోట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని ఎస్‌కోట మేజర్ పంచాయతీ 13వ వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో గల జాబ్ కార్డు ఉన్న కొంతమంది ఉపాధి హామీ కూలీలకు సంబంధిత మండల అధికారులు పూర్తిస్థాయిలో పని ఇవ్వటం లేదన్నారు. ఉపాధి హామీ చట్టంలో జాబు కార్డు కలిగిన కూలీలకు పూర్తిస్థాయిలో పని ఇవ్వాలని ఉన్నప్పటికీ సంబంధిత మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయిలో పని ఇవ్వడం లేదన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయిలో పని కల్పించని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత జిల్లా గ్రామీణ ఉపాధి హామీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని, అప్పటికీ చర్యలు చేపట్టకపోతే బాధితులతో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

రెవెన్యూ కార్యాలయానికి చెద

చెదలు పట్టిన కిటికీలు

వేపాడ : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి చెద పట్టింది. ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్న గది కిటికీలు మొత్తం చెద పట్టేయడంతో చెద పురుగుల వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గదిలోనే సుమారు 15 మంది రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ చెద పురుగుల వల్ల ఫైల్స్ కూడా పాడయ్యే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, గ్రామ రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్న భవనాన్ని, కిటికీలను బాగు చేయించి, వడగాల్పులు, వర్షాల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కొండవెలగాడలో చలివేంద్రం ప్రారంభం

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడలో మంగళవారం జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు సౌజన్యంతో ఆటో స్టాండ్ వద్ద చలి వేద్రాన్ని ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా 1000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వడ దెబ్బ తగలకుండా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎప్పటికప్పుడు తాగాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి యర్ర రమణ, సచివాలయం సిబ్బంది , గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

వంగర : ప్రభుత్వ కళాశాలలో చేరాలని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు అన్నారు. ఈ మేరకు వివిధ గ్రామాలలో ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు యొక్క ఇళ్ల వద్దకు వెళ్లి మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించి ప్రభుత్వ కళాశాలలో చేరితే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, పెంటంనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగు నీటి బోరుకు ఆర్థిక సాయం

బాడంగి : మండలంలోని లక్ష్మిపురం, తెంటువలస, పెదపల్లి, గజరాయివలస గ్రామాల మధ్య తాగునీటి బోరును రాష్ట్ర ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి పాలవలస గౌరు మంగళవారం ప్రారంభించారు. ఈ బోరును ఏర్పాటుకు బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బేబీనాయన ఆర్థిక సాయంతో వేసినట్లు ఆయన తెలిపారు. నాలుగు గ్రామలు రైతులు పొలంలో పని చేసేటప్పుడు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని బేబినాయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ముందుకొచ్చారని చెప్పారు.

సీతంలో 'మేధోసంపత్తి దినోత్సవం'

విజయనగరం : స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐపిఎఫ్‌సి, టిఐఎస్‌సి సీనియర్ రీజనల్ మేనేజర్ డాక్టర్ విజయ్ కుమార్ సాహూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన పరిధిని దాటి ఆలోచించి ఆవిష్కరణలు చేయాలని అన్నారు. మేధోసంపత్తి చదువుకు, పరిశ్రమలకు మధ్య వారధిగా పనిచేస్తుందని తెలిపారు. డిఎస్‌ఎన్‌ఎల్‌యు డైరెక్టర్, అకడమిక్ ఎఫైర్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ దయానందమూర్తి మాట్లాడుతూ పెద్ద పరిశ్రమలన్నీ ఒకప్పటి స్టార్టప్స్ అని తెలిపారు. స్త్రీలకు పేటెంట్స్ చేయటానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. సీతం కళాశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పేటెంట్స్ పొందినందుకు గాను యాజమాన్యం ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు విలువగల చెక్కులను అందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి. శశిభూషణరావు మాట్లాడుతూ మేధోసంపత్తికి కావలసిన పర్యావరణ వ్యవస్థను కళాశాలలో ఆవిష్కరించామని, విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, డీన్ డాక్టర్ వై.నరేంద్ర కుమార్, డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్ హెచ్ఒ డి డాక్టర్ ఎస్.వరూధిని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్మోహన్

ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

విజయనగరం టౌన్ : ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, పి.రమణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం దుప్పాడ, రాకోడు, జొన్నవలస గ్రామాల్లో ఉపాధి కూలీలతో నిర్వహించిన ప్రచారభేరి కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి చట్టానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని అన్నారు. సాఫ్ట్‌వేర్ లో మార్పులు తీసుకొచ్చి రెండు పూటలా పని పద్ధతిని తీసుకొచ్చారని, దీనివల్ల ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పనులకు బడ్జెట్లో నిధులు కేటాయించకుండా చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టం చేసి బడ్జెట్లో నిధులు కేటాయించాలని, ఒక్కపూటే పనులు నిర్వహించాలని 200 రోజులు పని రూ.600 కూలీ ఇవ్వాలని లేని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.ఆనంద్, హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు

- సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు చిన్నపిల్లలు
- అద్దెలు చెల్లించని ప్రభుత్వం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- వంగర

గర్భిణులు, బాలింతలకు, చిన్నపిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి పౌష్టికాహారం, ఆరోగ్య సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఏళ్లు గడుస్తున్నా అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు లేక అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. అద్దె కొంపల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మండలంలోని మొత్తం 29 పంచాయతీలకు గాను వివిధ గ్రామాలలో మొత్తం 69 అంగన్వాడి కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 432 మంది గర్భిణులు, 396 మంది బాలింతలు, 1104 మంది చిన్నారులు, ప్రీ స్కూలు పిల్లలు 826 మంది ఉన్నారు. అయితే ఈ 69 అంగన్వాడి కేంద్రాలకు సంబంధించి మద్దువలస, మగ్గూరు, నీలయ్యవలస, శ్రీహరిపురం, అరసాడ, తలగాం, రుషింగి, బంగారు వలసలోని అంగన్వాడి కేంద్రాలకు మాత్రమే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మిగతా మద్దివలస, వంగర, లక్ష్మింపేట, రాజుల గుమ్మడ, సంగాం, బాగేం పేట, కింజంగి, ఇరువాడ, మరువాడ తదితర గ్రామాలలో మొత్తం 60 అంగన్వాడి కేంద్రాలు అద్దె భవనాలలోనే నడుస్తున్నాయి. ఈ కేంద్రాల్లో సౌకర్యాలు లేక ఇటు అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది అటు గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

అద్దె భవనాల్లో ఇబ్బందులివే..

అద్దె భవనాలలో అంగన్వాడి కేంద్రాలు నిర్వహించడం వల్ల సమస్యలు అన్ని ఇన్ని కావు. కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల అంగన్వాడి సిబ్బందితోపాటు, అక్కడకు వచ్చిన గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటిని అంగన్వాడి సిబ్బంది ఏర్పాట్లు చేస్తుడటంతో వారికి మరింత భారమవుతోంది.

వంగరలోని రేకులు షెడ్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

గర్భిణులు, బాలింతలు కనీసం కూర్చొనేందుకు కూడా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఇంకా చెప్పాలంటే ఈ అద్దె భవనాల్లో కొన్ని చోట్ల విష సర్పాలు ప్రవేశించి భయ భ్రాంతులకు గురిచేస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. మండు వేసవిలో ఇరుకు గదులలో ఉక్క పోతతో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.

అద్దెలు చెల్లింపుల్లో జాప్యం

అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలకు నెలనెలా అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకానొక దశలో అంగన్‌వాడీ కార్యకర్తలే అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

పట్టించుకోని అధికారులు

ఎద్దునొప్పి కాకికు తెలియదు అన్నట్లుగా ఐసిడిఎస్ అధికారులు తీరు ఉంది. అంగన్వాడీ కేంద్రాల్లో కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చును. మౌలిక సదుపాయాలు కూడా లేవని తెలిసి కూడా అధికారులు తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి

అంగన్వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల ఇబ్బందులు గురవుతున్నారు. అందు వల్ల ప్రభుత్వ భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలి. లేదా కనీసం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలి.

వంజరాపు లక్ష్మి, జిల్లా గౌరవ అధ్యక్షులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్, విజయనగరం.

అధికారులకు నివేదించాం

అంగన్వాడి కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న విషయం జిల్లా అధికారులకు తెలియజేశాం. శివ్వాం, వివిఆర్ పేటలో గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. ఇప్పటికే నిర్మాణ పనులు కూడా చేపడుతున్నాం. అద్దె భవనాలకు బడ్జెట్ ఉన్నంత మేరకు బిల్లును చెల్లింపులు చేపట్టడం జరిగింది. మిగతా అద్దె బిల్లులు బడ్జెట్ వచ్చిన వెంటనే చెల్లింపులు చేపడతాం.

పూర్ణిమ, పిఒ, ఐసిడిఎస్ వీరఘట్టం ప్రాజెక్టు

మతతత్వ బిజెపిని సాగనంపుదాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మతోన్మాద, ప్రజావ్యతిరేక, నిరంకుశ బిజెపిని సాగనంపి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్.కోట, కాపుసొంపురం, పెదఖండేపల్లి, రాజీపేట, బొడ్డవర తదితర గ్రామాల్లో సిపిఎం, సిపిఐ నాయకులు ప్రచారభేరీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ మోడీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే, ఎల్ఐసి, బ్యాంకులు, ఓడరేవులతో పాటు వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేసే కుట్రలను అమలు చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఏటా 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని బిజెపి నిలుపుకోలేదని పైగా ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే పనులకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ, మండల కార్యదర్శి మోపాడ మధు కండిపల్లి భీముడు, వాడపల్లి గోపి, ఎన్. నారాయణ రావు, అచ్చిం నాయుడు, బాలు, శ్రీను తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

కొత్తవలస: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గాడి అప్పారావు

కొత్తవలస : మండలంలోని రెల్లి పంచాయతీ పరిధిలోని ముమ్మిడివానిపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార భేరి నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దుర్మార్గ పాలనపై విస్తృతంగా ప్రచారం చేస్తూ, ఈ రెండు ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలను దోచుకుంటున్నాయన్నారు. మరోవైపు ఆదాని, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నాయన్నారు. ప్రశ్నించే ప్రతి వారిని నిరంకుశంగా అనగదొక్కుతూ, మహిళకు కూడా రక్షణ లేకుండా చేస్తూ దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, నినాదాలతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎస్‌కోట: ప్రచారం చేస్తున్న సిపిఎం,సిపిఐ నాయకులు

వేపాడ: బిజెపి కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగ సభల్లో ముస్లింల రిజర్వేషన్ తీసేస్తాం అని చెప్పడం అంటే దేశంలో ఉన్న మైనార్టీలు, పేద బడుగు ప్రజలపై దాడి చేయడమేనని సిపిఎం నాయకులు జగన్ అన్నారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి, ఆకుల సీతంపేట, సోంపురం, బొద్దాం, ఎస్‌కోట, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం ప్రచార బేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజురోజుకు డీజిల్ పెట్రోల్ నిత్యవసర సరుకు రేట్లు ఆకాశం నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సేవ గొప్ప అదృష్టం

విజయనగరం టౌన్ : మనసుకు సంతోషం కలగాలంటే నచ్చిన పని చేయాలని.. నలుగురికి సేవ చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తామని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మాతృదేవోభవ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా నిరుపేదలకు, పేద విద్యార్థులకు రూ.1.36 లక్షల విలువైన నిత్యావసరాల సరుకులు, ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మనం సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని నలుగురికీ ఉపయోగపడేలా చూస్తే తిరిగి ఏదోవిధంగా ఆ ఫలం మనకు దక్కుతుందని చెప్పారు. సుమారు రూ.లక్షన్నర సొంత నిధులు వినియోగించి పేదల కనీస అవసరాలు తీర్చిన మాతృదేవోభవ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు తమ కుటుంబం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. అనంతరం పేదలకు నిత్యవసరాలు, దుప్పట్ల పంపిణీ, విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు డోల చిరంజీవి రావు, ఇపిడిసిఎల్ అధికారి లక్ష్మణరావు, సురేష్, బాబ్జి పాల్గొన్నారు

కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఆగ్రహం

గుర్ల: జమ్ము గ్రామంలో సేకరించిన చెత్తను రోడ్‌కు ఇరువైపులా వేయడంతో డంపింగ్ యార్డులా ఉన్నాయని కలెక్టర్ నాగలక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతి కార్యదరిని పిలిచి పారిశుధ్యం పనితీరుపై ప్రశ్నించారు. రోడ్డు పక్కన చెత్తవేయడం పై అగ్రహం వ్యక్తం చేశారు. చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలకు చెత్త తరలించకుండా రోడ్డు పక్కన వేయడం మంచిది కాదన్నారు. కిలోమీటర్ దూరం ఉన్న కేంద్రానికి చెత్త తరలించడంలో ఉన్న ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. ఆమె మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి సచివాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న విషయం తెలిసిందే..

మలేరియాపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీని మంగళవారం వియ్యంపేట పిహెచ్‌సి సిబ్బంది నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఇ. గోపాలకృష్ణ ఆధ్వర్యంలో దోమలు నివారిద్దాం – అంటువ్యాధులను తరిమికొడదాం అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, దోమలు నుండి భద్రత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ గోవిందరాజులు, పిహెచ్ఎన్ జగదాంబ, ఇఒ తిరుపతి రావు, హెచ్‌వి పద్మావతి, ఫార్మసిస్ట్ ఆశ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

గజపతినగరం: మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఎం. సాయికృష్ణారెడ్డి, అనూజ్ రాయ్‌లు అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి పరిధిలోని మరుపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వేపాడ : వేపాడ, బొద్దాం గ్రామాల్లో ఆయా పిహెచ్‌సిల ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధరణి, సతీష్ కుమార్ మాట్లాడుతూ మలేరియా ఎనాఫిలేస్ జాతికి చెందిన ఆడదోమ కాటుతో వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి. వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ సాయి రెడ్డి, ఏఎన్ఎం బి.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి రమ్య, సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులని కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని జె హారిక అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కొట్టం సిహెచ్ఒ తారకరావు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మలేరియా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది రామసత్యం, శ్రీనివాసరావు, శంకర్రావు, రామకృష్ణ, రాము, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : మలేరియా పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి భార్గవి, సర్పంచ్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మునకలవలసలో జిఎమ్ఆర్ ఐటి రాజాం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వైద్య సిబ్బంది ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎస్ రాజు, సావిత్రి, పుణ్యవతి, పావని, స్వామి నాయుడు, హరీ, 104 సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శాసపు జనార్ధనరావు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మంగళవారం అలజంగి గ్రామంలో గడపగపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామంలో స్థానికులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ప్రభుత్వ సహకారంతో వాటిని పరుష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ, ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మం నాయుడు, ఎఎంసి డైరెక్టర్ అల్లు త్రినాధ, మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, వైసిపి నాయకులు పూడి చిన్న, రేజేటి బుజ్జి, వెలగల శ్రీరాములు, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తవలస: మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: రాష్ట్రం జగన్ పాలలో సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం 184వ రోజు కొత్తవలస-1 సచివాలయం పరిధిలో ఎస్సీ కాలనీ, రాంజీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపను సందర్శిస్తూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ, ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, సమస్యలు పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పిఎసిఎస్ చైర్మన్ గొల్లపల్లి శివ, గొరపల్లి రవి, మేలాస్త్రి అప్పారావు, వార్డు మెంబర్ కుమారి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వీలుపర్తిలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్ రావు, వీలుపర్తి మాజీ సర్పంచ్ గోకాడ సత్యం నాయుడు, నాయకులు రావాడ వెంకట్రావు, అప్పలనాయుడు, దుల్ల వెంకట్రావు, బొడ్డు శ్రీను, సచివాలయం కన్వీనర్ గోకాడ శ్రీను గృహసారుదులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

మండలం, పట్టణంలోని పలు గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం జరిగాయి. మల్లమ్మ పేటలో కొత్తమ్మతల్లి, దేశతల్లి, బంగారమ్మ ఉత్సవాలు, కోమటిపల్లిలో సరిపోలమ్మ, యం. భుర్జివలసలో బంగారమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 14 సంవత్సరాల తరువాత ఈపండగలు రావడంతో బొబ్బిలి పట్టణం, ఆయా గ్రామాలు జన సందోహంతో నిండి పోయాయి. కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కోమటిపల్లి, మల్లమ్మ పేట పండగల్లో మాజీ ఎంపి బొత్స ఝాన్సీ, మల్లమ్మ పేట, యం.భుర్జివలస, కోమటిపల్లి గ్రామదేవత ఉత్సవాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆయా గ్రామ దేవత ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బొబ్బిలి : సిరిమానుపై తిరుగుతున్న పూజారి

వైభవంగా దుర్గాలమ్మ పండగ

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో దుర్గాలమ్మ పండగ వైభవంగా జరిగింది. 22 సంవత్సరాల తర్వాత వచ్చిన పండుగని గ్రామస్తులందరూ ఐక్యమత్యంతో మంగళవారం అతి వైభవంగా జరుపుకొన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గం యువనేత గొంప కృష్ణ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పులి వేషాలు, చిరతలు, తీన్మార్, జబర్దస్త్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ దండు ముత్యాలమ్మ, ఎంపిటిసి చామంతుల లక్ష్మి, వై.కె. నాయుడు, ఆధ్వర్యంలో పండగ ఉత్సాహంగా జరిగింది.

వేపాడ: దుర్గాలమ్మను దర్శించుకున్న గంటా శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ సురేష్ బాబుకు ఘన స్వాగతం

నెల్లిమర్ల : రెండోసారి ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి. సురేశ్ బాబుకు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రమాణ స్వీకారం తరువాత మంగళవారం తన స్వగ్రామం మొయిద రావడంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక మిమ్స్ కళాశాల నుంచి, కార్లు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి ఊరేగించి గజమాలతో సత్కరించారు.


ఎమ్మెల్సీని సత్కరిస్తున్న నాయకులు

అనంతరం మొయిద చేరుకొని స్వాగతం పలికిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్ బాబు మాట్లాడుతూ తన తండ్రి దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు అడుగు జాడల్లో నడిచి అనునిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి నిరంతర కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

శృంగవరపుకోట : పట్టణ శివారు సీతంపేటలో శానాపతి సన్నిబాబు ఇంట్లో గ్యాస్ లీకేజీ కారణంగా మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారి షేక్ మదీనా, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్యాస్ లీకయి ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, టీవీ, నిత్యావసర వస్తువులు, బట్టలు, విద్యుత్ మీటర్, గ్యాస్ స్టవ్, సిలిండర్ వంటివి కాలిపోవటంతో రూ.1,50లక్షలు ఆస్తినష్టం జరిగిందన్నారు. ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు లోకి తీసుకొచ్చారు. కాగా మంటలు ఆర్పే క్రమంలో ఎస్.నాయుడు అనే వ్యక్తి చేతులు కాలిపోవటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

వంగర: మండలంలోని మద్దువలస గ్రామానికి చెందిన మన్నేన వెంకటరమణతోపాటు మరో ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్ జనార్ధన రావు మంగళవారం తెలిపారు. గ్రామంలో ఈనెల 19న స్థల వివాదంలో రెండు వర్గాల మధ్య ఘర్షణపడి కొట్లాట జరిగిన కేసులో 8 మంది పై కేసు నమోదు చేసి వారిని కోర్టుకు తరలించినట్లు ఆయన వెల్లడించారు.